## 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం: ప్రిన్సిపల్ సంగమేశ్వర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గురుకుల పాఠశాలల్లో విద్యాయంలో విద్యను అభ్యసించాలనుకుంటున్న మైనారిటీ, నాన్ మైనారిటీ విద్యార్థులకు 2026 27 విద్యా సంవత్సరానికి గాను ఎలాంటి రాత పరీక్షలు లేకుండానే అర్హులైన 5వ తరగతి విద్యార్థులకు హయత్‌నగర్‌లోని తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ స్కూల్, అంబర్‌పేట్ బాయ్స్1లో మైనారిటీ, నాన్‌మైనారిటీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఈ.సంగమేశ్వర్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక విద్యాసంస్థలో నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధన, క్రమశిక్షణతో కూడిన విద్యా వాతావరణం, ఆధునిక సౌకర్యాలు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు అవసరమైన ధృవపత్రాలతో నేరుగా పాఠశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సకాలంలో ప్రవేశాలు పొందాలని ప్రిన్సిపాల్ ఈ.సంగమేశ్వర్ విజ్ఞప్తి చేశారు.

## కూలిన ఇల్లు.. తప్పిన ప్రమాదం

ఆశ్రయం కల్పించాలంటున్న బాధితుడు వెంకటయ్య



**ప్రజాపక్షం/కొందుర్గు:** కురుస్తున్న వర్షాలకు ఇల్లు కూలిపోవడంతో తృటిలో ప్రమాదం తప్పిందని బాధితుడు లింగని వెంకటయ్య తెలిపారు. శుక్రవారం రాత్రి జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని గుర్రంపల్లి గ్రామంలో కురిసిన వర్షానికి మట్టి ఇల్లు కూలిపోవడంతో అది చూసిన బాధితుడు లింగని వెంకటయ్య బోరున విలపించారు. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబం తనదని, తన కుటుంబానికి సొంత ఇల్లు లేకుండా పోయిందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేందుకు కృషి చేయాలని కోరారు. గతంలో అనేక మార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్ళి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వేడుకున్న ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి మట్టి ఇల్లు కూలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పంధించిన తనకు ఆశ్రయం కల్పించేందుకు కృషి చేయాలని కోరారు.

## రైతులకు ఎరువుల వినియోగంపై శాస్త్రీయ అవగాహన కల్పించాలి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** రైతులకు ఎరువుల వినియోగంపై శాస్త్రీయ అవగాహన కల్పించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. శనివారం నందిగామలో రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతలు పత్తి, వరి, మొక్కజొన్న పంటలకు ఏ స్థాయిలో ఎరువులు వినియోగిస్తారో తెలియకుండా వాడుతున్నారని వివరించారు. ఎరువుల వినియోగంపై పూర్తి స్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. యూరియా లభించదేమోనన్న భయంతోనే ఉన్నదాని కంటే ఎక్కువగానే వినియోగిస్తున్నారని గుర్తు చేశారు. రైతుల్లో వస్తున్న ఆందోళనలను దూరం చేసేందుకు అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించేందుకు అధికారులు కృషి చేయాలని పేర్కొన్నారు. గ్రామానికి ముగ్గురు ఆదర్శ రైతులను ఎంపిక చేసి యాప్ వినియోగంపై ముందస్తుగా శిక్షణ ఇవ్వాలని, దాంతో సామాన్య రైతులకు ఎరువుల కొనుగోలుపై సహాయ పడుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెకర్లు కె.విజయ్‌కుమార్, బి.నరసింహారెడ్డి, ఏడిఏలు మాధవి, సత్యంబాబు, ఏడీఎస్ శైలజతోపాటు రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఏడిఎస్ అధికారులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా రైతులకు ఎరువులు అందించాలన్నదే లక్ష్యం

వ్యవసాయ శాఖ రాష్ట్ర అదనపు డైరెక్టర్ విజయ్‌కుమార్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పారదర్శకంగా అన్నదాతలకు ఎరువులు పంపిణీ చేయాలన్నదే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని వ్యవసాయ శాఖ రాష్ట్ర అదనపు డైరెక్టర్ విజయ్‌కుమార్ వివరించారు. శనివారం షాద్‌నగర్, కొత్తూరు పట్టణాల్లో ఉన్న వివిధ ఫర్టిలైజర్ షాపులను స్థానిక వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. యాప్ పనితీరును, డీలర్ల వద్ద అమలవుతున్న విధానాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.



ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అదనపు డైరెక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎరువుల కొనుగోలు చేయడంలో అన్నదాతలు పడుతున్న ఇబ్బందులను దూరం చేయడంతోపాటు అక్రమంగా విక్రయిస్తున్న ఎరువుల నియంత్రణపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఎరువుల కోసం రైతులు క్యూలైన్లలో వేచి ఉండటం, బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించడం వంటి అనేక సంఘటనలపై విస్తృతంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

రైతులు షాపుల వద్దకు రావాల్సిన పని లేదని, ఇంటి వద్దనే ఉంటూ యాప్ ద్వారా ఎరువులను బుక్ చేసుకోవచ్చునని వివరించారు. పైలట్ ప్రాజెక్టు క్రింద రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలతోపాటు తెలంగాణ రాష్ట్రంలోని ఐదు జిల్లాను ఎంపిక చేసి అమలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు, డీలర్ల నుండి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యాప్ వినియోగం పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ఎరువుల కొనుగోలు సులభతరం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ తనిఖీల్లో రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారిణి శైలజ, వ్యవసాయ శాఖ ఏడిఏలు సత్యంబాబు, మాధవి, షాద్‌నగర్ ఏడిఏ రమాదేవిలు ఉన్నారు.

# భారీ వర్షానికి అప్రమత్తమైన హైడ్రా

అర్ధరాత్రిలోపు 26 చెట్లు తొలగింపు

వాటర్ లాగింగ్ ప్రాంతాల్లో వేగవంతమైన చర్యలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** శుక్రవారం రాత్రి నగరంలో కురిసిన భారీ వర్షానికి హైడ్రా డీఆర్‌ఎఫ్ బృందాలు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాయి. ఈదురు గాలుల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో చెట్లు నేలకూలగా, వాటర్ లాగింగ్ సమస్యలు తలెత్తిన ప్రాంతాల్లో కూడా అత్యవసర చర్యలు చేపట్టారు. రాత్రి 11.30 గంటల వరకు 26 చెట్లు నేలకూలినట్లు ఫిర్యాదులు అందగా, వాటిలో 21 చెట్లను అర్ధరాత్రిలోపే తొలగించారు. మెహిదీపట్నం, అత్తాపూర్ ప్రాంతాల్లో నీటి నిల్వలను తొలగించి రాకపోకలు సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్1లోని వెంగళరావు పార్కు సమీపంలో కూలిన చెట్లను తొలగించి నిమ్స్ ఆసుపత్రికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. మంగళవారం భారీ వర్షాలకు వరదలు వచ్చిన కొండాపూర్, మియాపూర్, రాయదుర్గం మెట్రో స్టేషన్, గచ్చిబౌలి బయోడైవర్సిటీ ప్రాంతాల్లో ముందుగానే పూడిక తొలగింపు పనులు చేపట్టడంతో శుక్రవారం వర్షాల సమయంలో నీటి నిల్వలు ఏర్పడలేదని అధికారులు తెలిపారు. నార్సింగి మెయిన్ రోడ్ ఇందిరా పార్క్ స్టీల్ బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో కూడా చెత్త, అడ్డంకులను తొలగించి నీటి ప్రవాహాన్ని సాఫీగా కొనసాగేలా చేశారు. వర్షం కురుస్తున్న సమయంలోనే క్షేత్రస్థాయిలో పనిచేసిన డీఆర్‌ఎఫ్ బృందాలు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టామని హైడ్రా అధికారులు చెప్పారు.

**హైడ్రా సహాయక చర్యల్లో బైక్ టీమ్‌ల కీలక పాత్ర**

వర్షాకాలంలో అత్యవసర సహాయక చర్యలను మరింత వేగవంతం చేసేందుకు హైడ్రా బైక్ టీమ్‌లను సమర్థవంతంగా వినియోగిస్తోంది. మొత్తం 20 బైకులతో మూడు షిఫ్టుల్లో 60 మంది సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నారు. డిఆర్‌ఎఫ్ వాహనాలు చేరుకోలేని ప్రాంతాల్లో బైక్ టీమ్‌లు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపడుతున్నాయి. ప్రతి బైక్కు ప్రత్యేక బాక్స్ అమర్చి, అందులో బ్యాటరీతో పనిచేసే రెండు చైన్సాలు, తాళ్లు, ఇతర అవసరమైన పరికరాలు ఏర్పాటు చేశారు. చెట్లు కూలిన సందర్భాల్లో కొమ్మలను కత్తిరించి, చెట్లను రహదారుల నుంచి తొలగించేందుకు వీటిని వినియోగిస్తున్నారు. ట్రాఫిక్ జామ్లు ఉన్నప్పటికీ బైక్‌ల ద్వారా వేగంగా చేరుకునే వీలుండటంతో అత్యవసర స్పందన సమయం గణనీయంగా తగ్గుతోంది. చెట్లు కూలిన సందర్భాల్లోనే కాకుండా వాటర్ లాగింగ్ ప్రాంతాల్లో కూడా గడ్డపారలు, ఇతర పరికరాలతో చేరుకుని



నీటి ప్రవాహానికి ఆటంకాలను తొలగిస్తున్నారు. ఇటీవల బంజారాహిల్స్ రోడ్ నెంబర్1లో వరుసగా మూడు చెట్లు కూలిన సందర్భంలో డిఆర్‌ఎఫ్ ట్రక్కులు చేరుకునేలోపు బైక్ టీమ్‌లు అక్కడికి చేరుకుని చెట్లను తొలగించి ట్రాఫిక్కు అంతరాయం లేకుండా చేశాయి. నిమ్స్ మిలీనియం బ్లాక్‌పై పడిన చెట్లను కూడా కిటికీల ద్వారా చేరుకుని తొలగించడం ద్వారా తమ సామర్థ్యాన్ని చాటాయి. నగరంలో మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లు, డిఆర్‌ఎఫ్ బృందాలు, స్టాటిక్ టీమ్లతో సమన్వయంగా పనిచేస్తున్న బైక్ టీమ్‌లు ప్రస్తుతం హైడ్రా అత్యవసర స్పందన వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అధికారులు తెలిపారు.

# సమగ్ర పరిపాలనా కేంద్రంగా.. ఎంఎంసి ప్రధాన కార్యాలయ నిర్మాణం

కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమగ్ర పరిపాలనా కేంద్రంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) ప్రధాన కార్యాలయాన్ని నిర్మించాలని కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి అన్నారు. ఉప్పల్ భగాయత్‌లో నిర్మించనున్న నూతన ప్రధాన కార్యాలయ భవన స్థలాన్ని ఎంఎంసి కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల ఉన్నతాధికారులతో కలిసి ఆయన కేటాయించిన స్థల పరిస్థితులను, భవన నిర్మాణానికి అవసరమైన ప్రాథమిక అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అధునాతన హంగులతో నూతన భవన నిర్మాణ ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దీనికోసం అనుభవజ్ఞులైన ఆర్కిటెక్ట్‌లతో సంప్రదించి, సమగ్ర ప్లాన్‌లను రూపొందించాలన్నారు. కేవలం కార్యాలయ అవసరాలకే పరిమితం కాకుండా, ప్రజా సౌకర్యం, విశాలమైన పార్కింగ్, సమావేశ మందిరాలు, డిజిటల్ సేవల కేంద్రాలు, ఇతర ఆధునిక మౌలిక వసతులతో ఈ భవనాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని వాటర్ బోర్డు, హైడ్రా వంటి ప్రభుత్వ అనుబంధ సంస్థలకు అవసరమైన కార్యాలయ స్థలాన్ని భవన ప్లానింగ్‌లోనే ముందుగానే గుర్తించాలని కమిషనర్ స్పష్టం చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో ఒకే చోట పనిచేసేలా దీనిని ఒక సమగ్ర పరిపాలనా కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**నీటి నిల్వలు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి**

వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మలాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉందని కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి తెలిపారు. హస్తినాపురం, పంచాయతీ రాజ్ టీచర్స్ కాలనీ, రెడ్డి కాలనీ, సాగర్ ఎక్స్ రోడ్ బైరామల్‌గూడ, శిఖర ఎన్‌క్లేవ్, లక్ష్మి నరసింహపురం కాలనీ తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను సమీక్షించారు. హస్తినాపురంలోని పంచాయతీ రాజ్ టీచర్స్ కాలనీలో వర్షపు నీరు నిలిచే ప్రాంతాలు, డ్రైనేజీ వ్యవస్థ, స్టార్మ్ వాటర్ డ్రెయిన్‌ల అనుసంధానాన్ని పరిశీలించిన కమిషనర్, లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ కాలువల్లో పేరుకుపోయిన చెత్త, అడ్డంకులను వెంటనే తొలగించి వర్షాకాలానికి సంబంధించిన పనులను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం సాగర్ ఎక్స్ రోడ్ రెడ్డి కాలనీలలో నీటిముంపు సమస్యలు తలెత్తే ప్రాంతాలను పరిశీలించి, ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బైరామల్‌గూడలోని సాగర్ ఎన్‌క్లేవ్‌లో భూగర్భ మురుగునీటి వ్యవస్థ, స్టార్మ్ వాటర్ డ్రెయిన్‌ల పనితీరును పరిశీలించిన ఆయన, వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా డ్రైనేజీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. ఈ సందర్భంగా రోడ్లు, ప్రజా ప్రదేశాల్లో వదిలివేసిన ఉపయోగంలో లేని కేబుల్ వైర్‌లను గమనించిన కమిషనర్, ప్రజల భద్రతకు ముప్పుగా మారుతున్న వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనుమతి లేకుండా వదిలిన కేబుల్లను వెంటనే తొలగించాలన్నారు. శిఖర ఎన్‌క్లేవ్, పిఎన్‌ఆర్ కాలనీ ఫేజ్2, లక్ష్మి నరసింహపురం కాలనీలలో నాలాలు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్లు, భూగర్భ మురుగునీటి వ్యవస్థలను పరిశీలించిన కమిషనర్, చెత్త, సిల్ట్ పేరుకుపోకుండా పూర్తిస్థాయిలో శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బైరామల్‌గూడ చెరువు ప్రాంతాన్ని సందర్శించిన ఆయన, చెరువు ఇన్‌లెట్, అవుట్‌లెట్ మార్గాలు, వాటితో అనుసంధానమైన నాలాలు, డ్రెయిన్‌ల పనితీరును సమీక్షించారు. వర్షపు నీరు చెరువులోకి చేరడం, బయటకు వెళ్లే మార్గాల్లో ఎలాంటి అడ్డంకులు లేకుండా నిర్వహణ చేపట్టాలని అధికారులకు సూచించారు.

# సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో.. టౌన్ ప్లానింగ్ అధికారుల బదిలీలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) పరిధిలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో భారీగా బదిలీలు, పోస్టింగ్‌లు జరిగాయి. పరిపాలనా కారణాల దృష్ట్యా అసిస్టెంట్ సిటీ ప్లానర్లు (ఎసిపి), టౌన్ ప్లానింగ్ అధికారులు (టిపిఓ), టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లకు (టిపిఎస్) సిఎంసి కమిషనర్ డాక్టర్ జి.సృజన బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

తెలంగాణ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం..సిఎంసిలో చేరిన అధికారులకు నూతన పోస్టింగ్‌లు ఇస్తూ, అలాగే ప్రస్తుతం విధుల్లో ఉన్న మరికొందరు అధికారులను బదిలీ చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు. బదిలీ అయిన అధికారులు తక్షణమే తమ కొత్త బాధ్యతలను స్వీకరించాలని కమిషనర్ ఆదేశించారు.

**బదిలీలు, పోస్టింగ్‌ల వివరాలు..**


బి. భాస్కర్ (టిపిఓ): మేడ్చల్ (సర్కిల్ 60), కుత్బుల్లాపూర్ జోన్ ఇన్‌చార్జ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా నియామకం.
ఎం. ప్రసాద్ (టిపిఓ): అమీన్‌పూర్ (సర్కిల్ 47), శేరిలింగంపల్లి జోన్ ఇన్‌చార్జ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్గా పోస్టింగ్.
ఎస్. హబీబున్నిసా (టిపిఓ): మాధాపూర్ (సర్కిల్ 50) ఇన్‌చార్జ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా నియమిస్తూనే, ఆల్విన్ కాలనీ (సర్కిల్ 51) అదనపు బాధ్యతలు అప్పగింత.
కె.సుష్మ (టిపిఓ): మియాపూర్ (సర్కిల్ 48) ఇన్‌చార్జ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా నియామకం, శేరిలింగంపల్లి (సర్కిల్ 49) అదనపు బాధ్యతలు.
ఇ.సురేందర్ రెడ్డి (ఎసిపి): కూకట్‌పల్లి (సర్కిల్ 52) ఏసీపీగా బదిలీ, మూసాపేట్ (సర్కిల్ 53) అదనపు బాధ్యతలు.
ఎ.కరుణాకర్ (ఎసిపి):చింతల్ (సర్కిల్ 54), కుత్బుల్లాపూర్ జోన్ ఎసిపిగా బదిలీ.
ఐ.రాణి (ఎసిపి):జీడిమెట్ల (సర్కిల్ 55) ఎసిపిగా బదిలీ, కొంపల్లి (సర్కిల్ 56) అదనపు బాధ్యతలు.
ఎం. ప్రసీద (ఎసిపి): నార్సింగి (సర్కిల్ 45) ఎసిపిగా బదిలీ, పటాన్‌చెరు (సర్కిల్ 46) అదనపు బాధ్యతలు.
ఎం.ఎ. జీషాన్ (ఎసిపి): కూకట్‌పల్లి జోన్ హెడ్ ఆఫీస్ ఏసిపిగా బదిలీ.
ఎ.భార్గవి సాయి (ఎసిపి): శేరిలింగంపల్లి జోన్ హెడ్ ఆఫీస్ ఎసిపిగా కొనసాగింపు.
ఆర్.సుమిత్ర (ఎసిపి): గాజులరామారం (సర్కిల్ 57) ఎసిపిగా యథావిధిగా కొనసాగింపు.
ఇ.శ్రీనివాస్ (ఎసిపి): దుండిగల్ (సర్కిల్ 59) ఎసిపిగా కొనసాగుతూ, నిజాంపేట్ (సర్కిల్ 58) అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు.
టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు (టిపిఎస్), ఇతర సిబ్బంది
పి.రమేష్ (టిపిఎస్): నార్సింగి (సర్కిల్ 45)కి బదిలీ, పటాన్‌చెరు (సర్కిల్ 46) అదనపు బాధ్యతలు.
బి.కిరణ్ కుమార్ రెడ్డి (టిపిఎస్): మూసాపేట్ (సర్కిల్ 53)కు బదిలీ, కూకట్‌పల్లి (సర్కిల్ 52) అదనపు బాధ్యతలు.
బి.మచేందర్ (టిపిఎస్): చింతల్ (సర్కిల్ 54) కు బదిలీ, జీడిమెట్ల (సర్కిల్ 55), కొంపల్లి (సర్కిల్ 56) అదనపు బాధ్యతలు.
బి.సరితాసేన్ (టిపిఎస్): గాజులరామారం (సర్కిల్ 57) కు బదిలీ.
జి.సాయి తేజ (డిఎంజిఆర్ 3): మేడ్చల్ (సర్కిల్ 60) కు బదిలీ.
ఎ.రోహన్ ఠాకూర్(టిపిబిఓ): అమీన్‌పూర్ (సర్కిల్ 47)లోనే కొనసాగింపు.
మహ్మద్ అక్బర్ (టిపిఎస్): శేరిలింగంపల్లి (సర్కిల్ 49)లో కొనసాగుతూ, మియాపూర్ (సర్కిల్ 48) అదనపు బాధ్యతలు.
యు.సంతోష్ కుమార్ (టిపిఎస్): మాధాపూర్ (సర్కిల్ 50)లో కొనసాగుతూ, ఆల్విన్ కాలనీ (సర్కిల్ 51) అదనపు బాధ్యతలు.
ముఖేష్ సింగ్ (టిపిఎస్): దుండిగల్ (సర్కిల్ 59) లో కొనసాగుతూ, నిజాంపేట్ (సర్కిల్ 58) అదనపు బాధ్యతలు.

సంబంధిత సర్కిల్ ఎసిపిలు తమ పరిధిలోని జోనల్ ఆఫీస్ పనులను కూడా పర్యవేక్షించాలని కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ బదిలీ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు.

# అర్హుడైన ఓటర్ పేరు జాబితాలో నమోదు అయ్యేలా చూడాలి

బూత్ స్థాయిలో పార్టీ బలాన్ని పెంచడమే లక్ష్యంగా పనిచేయండి

తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్ వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అర్హుడైన ఓటర్ పేరును జాబితాలో నమోదు అయ్యేలా చూడాల్సిన బాధ్యత బిఎల్ఓలపై ఉందని తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం షాద్‌నగర్ పట్టణంలోని సాయిరాజా పంక్షన్ హాల్‌లో బూత్ స్థాయి ఏజెంట్లకు (బిఎల్ఎలు) నిర్వహించిన శిక్షణ శిబిరానికి ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్ వీర్లపల్లి శంకర్, టిపిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి యోగేశ్వర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డి, రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షురాలు జ్యోత్స్న చౌదరిలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల వ్యవస్థకు వెన్నముక్కలగా బూత్ స్థాయి ఏజెంట్లు పనిచేయాలని, అర్హులైన ప్రతి వ్యక్తి పేరును ఓటర్ల జాబితాలో చేర్చేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రతి బూత్‌లో కాంగ్రెస్ బలాన్ని పెంచుకునేందుకు బూత్ స్థాయి ఏజెంట్లు చర్యలు తీసుకోవాలని, బూత్ స్థాయిలో విజయం సాధిస్తే రాష్ట్రంలో గెలిచినట్లే అవుతుందని వివరించారు. యువత, బడుగు బలహీన వర్గాలకు చెందిన అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటరు జాబితాలో చేర్పించేందుకు బిఎల్ఎలు కృషి చేయాలని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఇస్తున్న బిఎల్ఏ హ్యాండ్ బుక్‌ను పూర్తిగా అధ్యాయనం చేసి చట్టపరమైన నిబంధనలను, ఎన్నికల కమీషన్ మార్గదర్శకాలపై అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా బూత్ స్థాయి ఏజెంట్లు పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ సమావేశంలో ఫరూక్‌నగర్ మండల అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్, మండలాల అధ్యక్షులు చంద్రశేఖర్, ఎల్లారం శేఖర్‌రెడ్డి, కుమార్ గౌడ్, పురుషోత్తంరెడ్డి, రమేష్, పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, మున్సిపల్ చైర్మెన్ బసవేశ్వర్, వైస్ చైర్మెన్ అందె మోహన్, మార్కెట్ కమిటి చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ నాయకులు జగదీశ్వర్ అప్ప, బాల్‌రాజ్ గౌడ్, ఉప్పరిగడ్డ సర్పంచ్ చందునాయక్‌తోపాటు వివిధ గ్రామాల బూత్ ఏజెంట్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సైబరాబాద్‌లో మాన్సూన్ అప్రమత్తత

మల్కం చెరువు పరిసరాల్లో..

డిజిపి సి.వి.ఆనంద్, సిఎంసి కమిషనర్, సైబరాబాద్ సిపిల సంయుక్త తనిఖీలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వాతావరణ శాఖ భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో మాన్సూన్ సన్నద్ధత చర్యలను మరింత వేగవంతం చేస్తూ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) కమిషనర్ డాక్టర్ జి.సృజన, డిజిపి సి.వి. ఆనంద్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్‌లు మల్కం చెరువు పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. నీటి నిల్వలకు గురయ్యే ప్రాంతాలను పరిశీలించిన అధికారులు, వర్షపు నీటి పారుదల వ్యవస్థలు, అత్యవసర స్పందన ఏర్పాట్లు, వివిధ శాఖల సమన్వయ చర్యలను సమీక్షించారు. భారీ వర్షాల సమయంలో నీటి ప్రవాహం సజావుగా కొనసాగేలా చేపట్టిన పనుల పురోగతిని పరిశీలించారు. ఈ తనిఖీలలో మున్సిపల్, పోలీస్, ట్రాఫిక్, ఇంజనీరింగ్, మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు, అర్బన్ బయోడైవర్సిటీ విభాగం అధికారులు పాల్గొన్నారు. సున్నిత ప్రాంతాల్లో చేపట్టిన నివారణ చర్యలను సమీక్షించిన అధికారులు, అవసరమైన చోట అదనపు చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి నిల్వల ప్రాంతాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని కమిషనర్ ఆదేశించారు. మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు యంత్రాలు, సిబ్బంది, అవసరమైన వనరులతో ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందన కోసం అన్ని శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసినట్లు అధికారులు తెలిపారు.

## ఈషా సింగ్‌కు ఘన సన్మానం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అంతర్జాతీయ షూటింగ్ వేదికపై భారత కీర్తిని మరింత ఎత్తుకు చేర్చిన యువ షూటర్ ఈషా సింగ్‌కుహైదరాబాద్‌లో ఘన సన్మానం జరిగింది. జర్మనీలోని మ్యూనిక్‌లో నిర్వహించిన ఐఎస్ఎస్ఎఫ్ వర్డల్ కప్ 2026 మహిళల 25 మీటర్ల పిస్టల్ విభాగంలో స్వర్ణ పతకం సాధించడంతో పాటు సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పిన సందర్భంగా లైఫ్‌స్పాన్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర రామ్ నంబుల ఈషా సింగ్‌ను ప్రత్యేకంగా సన్మానించారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, తెలంగాణ స్పోర్ట్స్ అథారటీ వైస్ ఛైర్మన్ , ఎండి. సోనిబాలాదేవి, తెలంగాణ, ఎపి రాష్ట్రాల బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓపెన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నరేంద్ర రామ్ నంబుల మాట్లాడుతూ, ఈషా సింగ్ విజయం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఆమె పట్టుదల, అంకితభావం, క్రమశిక్షణ యువతకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. భావితరాల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తమ సంస్థ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. సన్మాన గ్రహిత ఈషా సింగ్ మాట్లాడుతూ, తన విజయ ప్రయాణంలో సహకరించిన కోచ్‌లు, కుటుంబ సభ్యులు, అభిమానులు, మద్దతుదారులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. యువ క్రీడాకారులు లక్ష్యసాధనలో ఏకాగ్రత, క్రమశిక్షణ, అంకితభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. పట్టుదల, ఏకాగ్రత, క్రమశిక్షణే నా విజయానికి బలమైన పునాది అని ఆమె అన్నారు. కార్యక్రమంలో భారత షూటింగ్ రంగానికి విశేష సేవలందించిన ప్రముఖ కోచ్ జస్పాల్ రాణ కు ఘన నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ ఒక నిమిషం మౌనం పాటించారు. ఈషా సింగ్ సాధించిన విజయం భారత షూటింగ్ చరిత్రలో మరో మైలురాయిగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.

## మన బడిలో మన జ్ఞాపకాలు

**ప్రజాపక్షం/షాబాద్:** మన బడిలో మన జ్ఞాపకాలు, పూర్వ విద్యార్థుల సమ్మేళనం పున్నర్జన్మ సుకృతంగా బావిస్తున్నట్లు పూర్వ విద్యార్థులు ఆనంద బాష్పలతో సంతోషం వ్యక్తం చేశారు. 1975 నుండి ఇప్పటి వరకు చదువు చెప్పిన గురువులకు గౌరవప్రదమైన స్వాగతం పలుకుతూ కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం వివిధ బ్యాచిల నుండి పూర్వ విద్యార్థులు మాటాలడుతూ.. అప్పటి చదువులకు, ఇప్పటి చదువులకు తేడా గురించి, బాల్యం దశలో చదువుకుంటే జీవితం ఎలా ఉంటుందో పూర్వ విద్యార్థుల అనుభవం తెలియజేశారు. పాఠశాలలో చదివిన విద్యార్థులు పాఠశాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనుల ప్రారంభం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** మచ్చబొల్లారం డివిజన్‌లోని హనుమాన్‌టేకిడి ప్రాంతంలో రూ. 25 లక్షల విలువైన సిసి రోడ్డు పనులను శనివారం స్థానిక మాజీ కార్పొరేటర్ రాజ్ జితేందర్‌నాథ్ ప్రారంభించారు. గత కొద్ది కాలంగా ఇక్కడి అంతర్గత రోడ్లు తీవ్రంగా దెబ్బ తినటం వల్ల స్థానికులతో పాటు వాహనదారులు ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో తాను గతంలో అధికారులకిచ్చిన ప్రతిపాదనలతో పెండింగ్‌లో ఉన్న సిసి రోడ్డు పనులు ప్రారంభమయ్యాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు నిరుప, నీలవేణి, హేమలత, బుజ్జి, గణేష్, ఈశ్వర్, మహేష్, శ్రీనివాస్‌లతో పాటు కాంగ్రెస్ శ్రేణులు సురేందర్‌రెడ్డి, శ్రీశైలం, శ్రీనివాసగౌడ్, సర్వేష్ యాదవ్, కొండల్‌రెడ్డి, విజయనాయుడు తదితరులు పాల్గొన్నారు.

